ఉచిత వైద్యశిబిరం

విస్సన్నపేట: స్థానిక రెడ్డిగూడెం రోడ్డులో ఉన్న స్టార్ మల్టీస్పెషాలిటీ క్లినిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో 156 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.













దుర్గాదేవీ నమోస్తుతే

ఇబ్రహీంపట్నం: దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. కొండపల్లిలోని వివిధ ఆలయాలు చలువ పందిళ్లల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పూజలు చేశారు. మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ భక్తులకు అన్న సంతర్పణకు రూ.30 వేలు సాయం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంగ్రకొండ గురవయ్య, కార్యదర్శి మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాచవరం, జూపూడి, కొటికలపూడి, ఇబ్రహీంపట్నం ఆలయాల్లో పూజలు నిర్వహించారు.


బలివేలో దుర్గాదేవిగా అమ్మవారు


చనుబండలో దుర్గాదేవి అవతారం


తిరువూరులో శాకంబరీదేవిగా..

అమ్మవారికి సామూహిక గౌరీ ఆరాధన

మైలవరం: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మైలవరం కోట వెనక వేంచేసియున్న శ్రీ కోట మహాలక్ష్మి ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి ఆదివారం గౌరీ ఆరాధన నిర్వహించారు. 200 మంది మహిళలు పాల్గొని సామూహిక గౌరీ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. పూజలు అనంతరం 108 రకాల ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. మైలవరం తిరువూరు రోడ్డులోని రేణుకా సమేత పాండురంగస్వామి ఆలయంలో అమ్మవారిని బంతిపూలతో అలంకరించారు. స్థానిక కంచికామాక్షి ఆలయంలో దసరా సందర్భంగా శనివారం రాత్రి శ్రీమాగులూరి త్రినాథాచార్యులు శిష్య బృందంచే కూచిపూడి నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిషాసురమర్దిని నృత్య రూపకం భక్తులను ఆకట్టుకుంది. నూజివీడు రోడ్డులోని కోదండ రామాలయంలో దసరా ఉత్సవాలు సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

బలివేలో..

బలివే(ముసునూరు): సకల ఐశ్వర్య ప్రదాతా! దుర్గామాతా! అభయమివ్వు తల్లీ! అంటూ దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఎనిమిదో రోజు ఆదివారం దుర్గా మాతకు భక్తులు పూజలు నిర్వహించారు. బలివేలోని ప్రసిద్ధ బలేరామలింగేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అమ్మవారిని దుర్గాదేవిగా అర్చకులు చావలి అమర్‌బాబు అలంకరింపజేసి, భక్తులకు దర్శనం కల్పించారు. గోపవరం కాశీ విశ్వేశ్వరాలయం, నాగేంద్రపురం, ముసునూరు రైస్ మిల్లు సెంటర్, చెక్కపల్లి, వేల్పుచర్ల, రమణక్కపేటల్లోని కోదండ రామాలయాల్లో, గుడిపాడు, వలసపల్లి, చింతలవల్లి శివాలయాల్లోనూ, అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. లోపూడిలోని కోదండ రామాలయం వద్ద, అమ్మవారిని కనకదుర్గా దేవిగా అలంకరించి, భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు.

చాట్రాయిలో..

చాట్రాయి: దేవీ నవరాత్రులు సందర్భంగా శనివారం అమ్మవారు దుర్గా దేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. చనుబండ మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద అయ్యప్ప స్వాములు భజనలు చేశారు. కృష్ణారావుపాలెం బీసీ కాలనీలో అన్నదానం చేశారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలో కొలువై ఉన్న కోట మహీషాసురమర్దిని అమ్మవారు దసరా నవరాత్రుల్లో భాగంగా ఆదివారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు జీ సత్యనారాయణచార్యుల నేతృత్వంలో మేలికొలుపు, శ్రీ చక్రార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నూజివీడులోని వాసవీ అమ్మవారి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు వస్త్రదానం చేశారు.

అన్నదానం

గంపలగూడెం: గంపలగూడెం గాంధీ సెంటర్లో ఆర్యవైశ్య, మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి పందిరి వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు.

దుర్గామాతకు సారె సమర్పణ

ఊటుకూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం ఊటుకూరు గాంధీ సెంటర్లో వాసవిక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఆదివారం సారె సమర్పించారు.

తిరువూరులో..

తిరువూరు: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా తిరువూరులోని పలు ఆలయాల్లో అమ్మవారిని విశేషాలంకారాలతో పూజించారు. శాంతినగర్ కనకదుర్గాలయంలో, శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో, శ్రీగౌరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవిగా, భద్రకాళిగా అలంకరించారు. జగన్నాథపురం కాలనీలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి పూజాదికాలు నిర్వహించారు.

పుట్రేలలో..

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేలలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ చైర్మన్ కోటగిరి వెంకట సత్య శేష సునీల్ కుమార్, ఈఓ యడ్లపల్లి సీతారామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే వసంత కార్యాలయంలో పూజలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గొల్లపూడిలోని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయంలో ఆదివారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు పాల్గొన్నారు.

సుందరరావుకు నివాళి

ముసునూరు: కొర్లగుంట ఎంపీటీసీ సభ్యుడు వన్నెకూటి సుందరరావు శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, సర్పంచ్ ఎస్.సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, జిల్లా రైతు సంఘ నేత పల్లె రవీంద్రరెడ్డితో కలిసి కొర్లగుంట వెళ్లి సుందరరావు భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఏలూరు ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు


ఎంపీ శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు మండల వైఎస్సార్ నేతలు ఆదివారం తరలివెళ్లారు. ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ తదితరులు కామవరపుకోట నుంచి ఎంపీతో పాదయాత్రలో పాల్గొని ద్వారకా తిరుమల చేరుకున్నారు. అనంతరం ఏలూరులోని ఎంపీ కార్యాలయం వద్ద నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుతో కలిసి ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

ఆగిరిపల్లి: పుట్టుకతో లేదా ప్రమాదంలో అవయవాలు పోగొట్టుకున్న దివ్యాంగుల జీవితాల్లో కృత్రిమ అవయవాలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మాజీ సభ్యుడు, విజ్ఞాన్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రామమూర్తి నాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ ఎలిజబెత్ ఫాంటన్ లెగసీ ఆఫ్ హోప్ కృత్రిమ అవయవ కేంద్రంలో పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన సుబ్బారావు, తాడేపల్లిగూడెంకు చెందిన జ్యోతి కిరణ్, ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన రాజులమ్మ, తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన వెంకటేశ్వర్లు, బాపట్ల జిల్లా పొన్నూరుకు చెందిన రాజుకు కృత్రిమ కాళ్లను ఆదివారం అందజేశారు.

కబడ్డీ కోర్టు ప్రారంభం

నూజివీడు: దసరా ఉత్సవాల్లో భాగంగా నూజివీడులో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు 71వ అఖిల భారత మహిళల, పురుషుల కబడ్డీ పోటీలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి కబడ్డీ కోర్టులో ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం కబడ్డీ కోర్టును ప్రారంభించారు. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, ఫెస్టివల్ కమిటీ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.









పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థుల(1993–94 బ్యాచ్) ఆత్మీయ సమేశనం ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగింది. అప్పట్లో గురువులను సన్మానించారు.











